# విమర్శ

మనవెవరూ విమర్శించేవాళ్ళు లేరనుకుంటే - మనం అసాధారణ ప్రజ్ఞాదురంధురులమనీ - భూలోకవాసుల్ని ఉద్ధరించడానికి ఎక్కడి నుండో ఊడిపడ్డ మహామహులమని మనని మనం గొప్పగా అభివర్ణించుకుంటాం !

అలాంటి సందర్భాల్లో... ఒక 'చిన్న విమర్శ'..... మూసుకుపోతోన్న కళ్ళు తెరుచుకొనేలా - ఎక్కడో గాల్లో తేలిపోతోన్న పాదాలను నేలమీద ఆనేలా - చేస్తుంది !

'విమర్శ' మనిషిలో బుసకొట్టే నియంతృత్వాన్ని అదుపులో పెట్టి అతడి దూకుడికి కళ్ళెం వేస్తుంది. విమర్శే లేకపోతే మనిషి ఆగడాలకు పట్టపగ్గాలుండవు. తను చేసిన తప్పులన్నీ ఒప్పులుగానే తలపోస్తాడు.

అయితే మనిషి ఎదుగుదలకి 'విమర్శ' ఎంత అవసరమైనా - విమర్శలో వెట 'కారం' ఎక్కువైతే - ఆ ఘాటుకి దిమ్మ దిరిగి సొమ్మసిల్లిపోతాడు విమర్శకు గురైన వ్యక్తి! ఆ దెబ్బతో అతనిలోని సృజనాత్మక శక్తి కుంటుబడిపోతుంది!

కొందరు మనసులో కొందరిపట్ల ముందే కొన్ని 'పూర్వభావన'లు (Prejudice) ఏర్పరుచుకుంటారు. వాళ్ళపట్ల తమ అభిప్రాయం 'నెగిటివ్' అయితే - వాళ్ళు మంచి పనిచేసినా - అందులో చెడే వుందని విమర్శిస్తారు. ఒకవేళ 'పాజిటివ్' అయితే - వాళ్ళలో చెడు తొంగి చూసినా మంచివాళ్ళేనని సర్టిఫికెటిస్తారు. అంతేగానీ వాళ్ళ పట్ల అంతకు పూర్వం తామేర్పరచుకున్న అభిప్రాయాల్లో వివక్ష ఉందనీ, ఎదుటి వాళ్ళ వ్యక్తిత్వం పట్ల ముందే ఒక అవగాహనకి రావడం తప్పనీ - 'ఆత్మవిమర్శ' చేసుకోరు!

ఒక మనిషిలో ఎన్ని చెడు గుణాలున్నా వాళ్ళ మంచి గుణాలను మాత్రమే దర్శించి వాళ్ళని మెచ్చుకోగలిగే 'మహానుభావులు' ఏ నూటికో కోటికో ఒక్కరుంటే - ఒక వ్యక్తిలో అన్నీ మంచి లక్షణాలే వున్నా - అతడిలో కనిపించే ఒకటీ, అరా చెడు లక్షణాలను భూతద్దంలో చూపెట్టి, 'వాడలాంటి వాడూ - ఇలాంటి వాడూ' అని విమర్శించే 'సామాన్యులు' కోకొల్లలుంటారు !

కొందరు రాజకీయ నాయకులు - ప్రజలు తమని ఎక్కడ మరిచిపోతారో అని తమ ఉనికిని చాటుకోవడానికి - అడపాదడపా పత్రికా ప్రకటనల ద్వారా స్వపక్షీయులు, విపక్షీయులు అనే విచక్షణ లేకుండా ఎవర్నో ఒకర్ని విమర్శిస్తూ పేపర్లో పైసా ఖర్చు లేకుండా 'పబ్లిసిటీ' పొందాలనుకుంటారు!

నిజానికి ఏదో విధంగా వార్తలకెక్కి - ప్రతినిత్యం పేపర్లో తమ పేర్లు చూసుకుని మురిసి, తరిద్దామన్న యావ తప్ప, ఇలాంటి వాళ్ళకు ప్రజా సమస్యలు పట్టవు!



*Contd...*

ఒక వ్యక్తిలో గానీ, రచనలో గానీ 'లేని దోషాల'ను అంటగట్టి - 'ఉన్న సద్గుణాల' ను ఉద్దేశపూర్వకంగా మరుగుపరిచి - అతడిలోని ఉత్సాహపు పొంగుమీద నీళ్ళు చిలకరిస్తూ, అతడి అభిప్రాయాలకి వక్ర భాష్యాలుచెప్పడం : **కువిమర్శ** (Destructive Criticism)

**ఒక రచనలోని ఏ 'చెడు' అంశం పాఠకుల మెదళ్ళని ఏ రకంగా కలుషితం చేస్తుందో, ఏ 'మంచి' అంశం పాఠకుల మనసుల్ని ఏ విధంగా వికసింపచేస్తుందో - సరదాగా, సున్నితంగా - ఆయా రచయితలు నొచ్చుకోకుండా - వాళ్ళ కలాలని అభ్యుదయ పథంలో నడిపించేలా సమీక్షకుడు విశ్లేషించగలగడం:** సద్విమర్శ (Constructive Criticism)

నిష్కల్మష హృదయులు సదుద్దేశంతో సద్విమర్శల ద్వారా మనిషి 'ఎదుగుదల' కి తోడ్పడ్తే - కుత్సిత స్వభావులు దురుద్దేశంతో కువిమర్శలకి పూనుకుని ఆ మనిషిలోని సర్వ శక్తుల్నీ 'చచ్చుపడేలా' చేస్తారు!

**కువిమర్శ వ్యక్తిని నిరాసక్తునిగానో, 'విరక్తునిగానో, జడునిగానో, మొండివానిగానో మారిస్తే, సద్విమర్శ వ్యక్తిలోని లోపాలను సవరించి... అతని సంస్కారానికి మెరుగులు దిద్ది.... ప్రగతిపథం వైపు దూసుకుపోయేలా చేస్తుంది!**



01-06-1996